
# ఎచటికి పోతావు రాత్రి



ఎచటికి పోతా వీరాత్రి ?

ఎవరు దిక్కు నాకు ?

ఈ రైల్లో అర్ధరాత్రిపూట ఇలా ప్రయాణం చేస్తూచేస్తూ ఎక్కడికో, తిరిగిరాని ఏచోటుకో వెళ్ళిపోతానేమో ?

నాకు తెలుసు. ఇంకా కొంచెం సేపట్లో రైలు పడిపోతుంది. ఇన్ని వందల ప్రాణాల అంతిమయాత్రకు ఈరాత్రి వీడ్కోలు చెబుతుంది !

నిజంగా ఎంత భయంకరమైన రాత్రి ఇది ! శాశ్వతమేమో ననిపిస్తోం దీరాత్రి !

అయినా ఈరైలు కెంతధైర్యం. ఒంటరిగా ఎడారిలోంచి, కొండలమధ్య నుంచి, నదులమీదనుంచి, అరణ్యాల లోంచి జరజర ప్రాకిపోతోంది. ఈ పెట్టెలో ఓ మూలగా కూర్చున్నా. ఎందుకో తెలియదు ఈపూట ఎన్నో భయంకరమైన ఆలోచనలు వెంటాడు తున్నాయి. నా హృదయం గుబులుతో దిగులుతో బరువెక్కిపోతున్నది.

ఇది చరమరాత్రి; ఈరాత్రి ఇంకా కొన్ని గంటలకి తెల్లారిపోతుంది. కాల దేవతకు మరో క్రొత్తరోజు పుడుతుంది కాని ఆ 'రేపు' యొక్క ఆద్యంతాలు మాకు తెలీవు. మృత్యుదూత చిరుపదాల కింకిణీరవాలు వినబడుతున్నాయి. కొన్ని నిమిషాలలో ఒక్కసారి మా అందర్నీ -

బయటకుచూస్తే గుండె గుభేలు మంటుంది. కాని సాయంకాలంనుంచీ అలాగే చూస్తూ కూర్చున్నాను. పైన బాగా మబ్బుపట్టింది. చెట్లపైన ఎర్రపూలు వర్షపుజల్లుకి తడిసిముద్దయి వణుకుతూ ముడుచుకు కూర్చున్నాయి. ఆకాశంలో తెల్లనికొంగ దారితెలియక ఎగురుతోంది.

"అరుణ"

ఆ సాయంకాలం గడిచిపోయింది.

కొండల్లోంచి ఒంటరిగా దూసుకు పోతోంది రైలు. అయినా దీన్నిండా మనుష్యు లున్నారు ఆశల్లో!

ఇటువైపు చూస్తే మరణంలాంటి లోయ. చీకటితో నిండింది.

అటువైపున మబ్బుల కిరీటాల్ని పెట్టుకుని చీకటి తెరలమాటున రాజ్యం చేస్తున్న కొండరాణి.

ఉండి ఉండి రివ్వున మీదపడే జల్లు. మూడురోజులనుండీ ఎడాతెరిపి లేకుండా కురిసినవర్షం ఈరోజే తగ్గింది. నా ఖర్మ కొద్దీ ఈ రోజే నేను బయలుదేరవలసి వచ్చింది. రేపు సాయంకాలంగాని ఆ 'అరణ్యం' చేరను. ఆ అడవిలో అన్నీ వెదుక్కోవాలి. ఉన్నవాడిని ఉండనీయక ఎందుకొచ్చిన ట్రాన్స్ఫర్లు?

పైవాళ్ళమీద కోపం వచ్చింది; మా అవస్థ వాళ్ళకేం తెలుస్తుంది.

ఆశలు లేని వారికి ప్రాణభయం ఉండదు. కాని నాకు ఆశలు వున్నాయి; ఎన్నో-జీవితాన్ని నిండుగా పరిపూర్ణంగా అనుభవించాలని వున్నది. నా జీవితాన్ని తామరాకుమీది నీటి బిందువులా ప్రకాశింప చేసుకోవాలని ఉన్నది. జీవితమంటేనే అందం.

కాని ఎలా? ఈ రైలు పడిపోతున్నది. నేను బ్రతకను; నా దీర్ఘయాత్ర ఈ రైలులో సాగుతున్నది.

బయటకు చూశాను.

నిరంతర శూన్యంలో లీనమౌతోంది కాలం! కాటుక పూసునన్న కొండ రేఖామాత్రంగా కనిపిస్తూ మమ్మల్ని వెంబడిస్తోంది గతంలా.

"అయ్యో, రైలు పడిపోతోంది. ఆపెయ్యమనండి. వెళ్ళకండి.'' అని బ్రతిమాలుతూ చెబుతున్నది.

దాని మాట వినే దెవరు? రైలు తెగించింది. కాలచక్రముతో పోటీ పడుతున్నాయి రైలు చక్రాలు.

కొండ మాతో చాలాదూరం వచ్చింది. దారిపొడగునా దాని విలవిలలు నాకు వినిపిస్తూనే వున్నాయి. అయినా 'బుద్ధిః కర్మానుసారిణి' అని వుండనే వున్నది కదా! ఇం కెందుకు ఆగుతుంది రైలు?

కొండ అలసి వెనకపడుతున్నది. మరో వైపు మహాలోయ అలసిపోయిన ప్రయాణీకులను సేద తీర్చుకోమంటున్నది. అటువైపు కొండ రాలేక జాలితో కన్నీరు కారుస్తున్నది.

ఇంతమంది ప్రాణుల సందడితో తన ఇల్లు కళకళలాడుతుందని సంతోష పడుతున్నది లోయ! చీకటిగోతుల్లో దాని నవ్వు ప్రతిధ్వనిస్తున్నది.

ఏమీ చేయలేక 'ఇదంతా కర్మ' అని తృప్తి పడి నిలిచిపోయింది కొండ.

ఒకవైపు భవిష్యత్తు; ఒకవైపుగతం; ఒకవైపు ప్రేమ; ఒకవైపు ద్వేషం.

ఈ రెంటిమధ్యలోంచి దూసుకుపోతోంది రైలు. అనంతమూ, భయావహమూ ఐనరాత్రిఎప్పటికితెల్లవారుతుంది?

ఈ చీకట్లో ఆ పట్టాలు సరిగా కనప డతాయా? ఉహుఁ! నిద్రకుజోగుతూ రైలు నడుపుతూంటారు. ఏదో ఓక్షణంలో —

నా కళ్ళలో వసంత మెదిలింది. ఈ పాటికి నిద్రలో వుండివుంటుంది. తెల్ల వారి 'నేను' లేని ఆ ఇంట్లో దిగులుతో తిరుగుతుంది. అయినా త్వరలోనే కలుసు కుంటాముకదా అని ధైర్యంతో లేనినవ్వు తెచ్చుకుంటుంది. కాని నా సంగతి ఎవ రికి తెలుస్తుంది అప్పుడే? ఇంకా రెండు రోజులకుగాని పేపర్లు ఈ విషాదవార్త నందించవు. అందాక వసంత ఉత్సా హంగానే ఉంటుంది!

నాకు నిద్రరావటంలేదు. రాత్రి, గృహ ములో అతిథిలా, చీకటి తిష్టవేసుకు కూర్చుంది. రివ్వున చలిగాలి వీస్తున్నది. గాజుపలక మూసివేశాను. వర్షపుజల్లు గాజుపలకమీద పడుతున్నది.

బయట ఏవీ కనపడటంలేదు. దయ లేని మబ్బులు నక్షత్రాలని దాచేసినయి; గాఢంగా క్రమ్ముకుంటున్నయి. వర్షపు చప్పుడు తప్ప ఏమీ వినిపించటంలేదు.

త్రాగినవాడిలా తూలుతున్నది రాత్రి. ప్రియుపరిష్వంగలో మైమరచి ఉన్మాదిని ఐంది చీకటి. ఆ చీకటిని శిక్షించటానికి ఆకాశం క్రోధతీక్ష్ణాలను ప్రసరింపస్తూంది.

మెరుపు వెలుగులో భయంకరమైన ప్రకృతి మరోరూపం కనిపిస్తున్నది. ఈ రూపం ఎంత గొప్పదని! ఎంతశక్తి వంతమైనదని. నా కనులముందు ఒక్క సారి ఆ విశ్వరూపం ప్రత్యక్షమైంది. చూడలేని గ్రుడ్డితనం నన్నావరించింది. ఇప్పుడే, ఈ క్షణంనుంచే ఇక్కడ ప్రకృతి పరిపాలన ప్రారంభ మైంది.

ప్రకృతి ఉన్నట్లుండి గర్జించింది. దూరంగా ఎక్కడో పిడుగుపడింది. నా మనస్సు భయంతో విలవిల్లాడింది. గతా నుభవాల తెరలు క్రమ్మివేశాయి. ఇంత వరకు జీవితంలో సంతృప్తిని పొందాను. ఎదురుదెబ్బలు తగ్గలేదింతవరకు. వసంత నన్ను అనంతంగా ప్రేమించింది; ప్రేమి స్తూంది. తనమీద తనకున్న ప్రేమకన్నా నామీద ప్రేమ ఎక్కువ వసంతకు.

అలాంటి వసంతకు దూరంగా పోతు న్నాను. ఇంక కనిపించను. సాయంకాలం కాగానే వాకిట్లోకి వచ్చి నిల్చుంటుంది.

సన్నజాజుల పరిమళం నీరెండతో కలసి ఆమెను చుట్టుముడుతుంది. అనం తము, శూన్యము అయిన ఆకాశం తన నీలిమతో ఆమెను వెక్కిరిస్తుంది. రోజు వచ్చే చిలుక చెట్టుమీద వాలి ఏడుస్తూ తిరిగిపోతుంది. భారంగా ఆలసిపోయిన నేడు నిన్నలోకి జారుకుంటుంది దీర్ఘనిద్ర కోసం. నా కోసమని ఏ చరిత్రలూ వెదు కరు. వసంతకి నుదుటన తిలకం బదులు గుండెల్లో ఆరనిమంట వుంటుంది. ఆ ఒంటరి వసంత మీదనుంచి శిశిర వసం తాలు జారిపోతునే వుంటాయి. అదృ శ్యంగా ఆమెచుట్టూ, ఆమె ఆత్మచుట్టూ నానీడలోంచి నారూపం దృశ్యాదృశ్యంగా

కనిపిస్తూ వుంటుంది. గొంతుచించుకుని నే పిలిచే పిలుపులు వసంతకి వినపడవు! ఆ ఏకాకితనంలో దివారాత్రాలు ఉదయించి అస్తమిస్తయి. నిద్రపట్టని రాత్రుల్లో ఏడుస్తూవెలిగే దీపంతప్ప తోడుండదు.

తీరని ఈ వెలితి జీవితాంతమూ వెంబడిస్తుంది. శూన్యగృహం లాంటి జీవితంలో పిచ్చిగా తిరుగుతూ వుంటుంది వసంత; పిచ్చి వసంత!

నా జీవితం తన పర మనుకునే వసంత. నా కోసరం ఏ త్యాగమైనా చేయగల ప్రేమమూర్తి వసంత. ఆ వసంతకి దూరంగా నేను తప్ప మరెవరైనా పోగలరా?

"వెళ్ళకండి! ఈ వర్షంలో ఎందుకు? ఈ ఒక్క రోజు వెళ్ళకపోతే ఏమీ అవదు. మీ వంట్లో అసలే సరిగా లేదు. జ్వరంగా వుందంటే కొడతారా ఏం? వర్షంలో వెళ్ళకూడదంటారు," అంటూ ప్రతిమాలినఆక్షణం కళ్ళల్లో మెదల్తోంది.

ఆఖరుసారివసంత కన్నీరుతుడిచింది. మొదటిసారివసంతకళ్ళల్లోనీరుచిందింది.

"చలిగావుంది. స్వెటర్ వేసుకోండి, మఫ్లర్ కట్టుకోండి; వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తారు గదూ! వెంటనే ఇల్లు చూడండి. నేనూ పాపా వచ్చేస్తాం. ఆ హోటలు తిండి తినలేరు;" ఎన్ని అప్పగింతలు!

ఈ చీకటి ఏ శూన్యంలో మాయ మౌతోందో, నేనూ ఆ శూన్యంలోనే లీనం కాబోతున్నాను.

"బటానీలు, బాబూ బటానీలు."

ఆలోచనలలో అణిగిపోయిన నా ఆత్మ ఒక్కసారి మేలుకుంది.

నా పిచ్చిఆలోచనలను బటానీలవాడు చెదరకొట్టేశాడు.

"ఇప్పు డెవరు కొంటారయ్యా, సీసొ ద గా ని. ఇంకోపెట్టె చూసుకో. మూలనున్న ముసలాయన గునిశాడు.

"నీ కెందుకయ్యా గొడవ. కొన్న వాళ్ళే కొంటారు." బటానీలవాడు తిరుగబడ్డాడు. ముసలాయన మరిమాట్లాడలేదు.

ఎదురుగా కూర్చున్నవ్యక్తి బటానీలవాడిని చురచురచూసి ఒదిగికూర్చున్నాడు.

ఈ గోలకి పెట్టెలోనివాళ్ళు లేచారు.

"అమ్మోయ్, లేవ్వే. బటానీలు వచ్చినయి." చిట్టిచేతులతో లేపేశాడు తల్లిని.

"ఛీ, ఇప్పుడు తినకూడదమ్మా, జబ్బు చేస్తుంది;" తల్లి అడ్డగించింది.

"మరెప్పు డేంటి?" బిక్కమొహం పెట్టాడు.

"రేపు కొనిపెడతాను, తిందువుగాని. చెల్లికి పెడతావా, నువ్వే తింటావా?"

మరిపించాలని చూసింది తల్లి.

"నేనే తింటా," మురిసిపోతూ అన్నాడు కొడుకు.

ఇంతలో చెల్లి అనబడే నాలుగేళ్ళ పిల్ల ఏడుపు సాగించింది.

"ఉఁ! ఉఁ. నాకు పెట్టట్ట. నా న్నేం చెప్పావేం? అందర్నీ తినమనలా–"

"అబ్బ, పెడతాడులేవే, ఒకటేగొడవ, పడుకో. అర్ధరాత్రిపూట ఏంగోల బాబు."

ఆవిడ పడుకుందామని చూసింది. కాని వీళ్ళు పడుకోనిస్తేగా!

"పోనీ ఇప్పుడు కొనుక్కోని రేపు తింటాలేవే. ఏం కొనుక్కోనా?"

"ఇప్పుడు మంచివి ఉండవు - రేపు మంచివి వస్తయి."

బటానీలవాడు ఆవిడవంక చురచుర చూశాడు. "వేడివేడి బటానీలు. గిద్దా పది పయిసాలు."

మళ్ళీ అరిచాడు.

రైలు ఏదో వంతెనమీదనుంచి పోతున్నట్లుంది. ధన్‌ధన్ మన్నది.

"అబ్బబ్బ! ఏంగొడవరా! ఆయనవస్తే బాగుండేది మీ అందిరికీ," అన్నది తల్లి.

కుర్రవాడు ఏడుపు లంకించుకున్నాడు.

"రాత్రిపూట ఎందుకు ఏడిపిస్తావమ్మా పసివాడ్ని? కొను;" ముసలాయన సలహా. తల్లికి తప్పలేదు. పది పైసాలు పెట్టి కొని జేబులోపోసింది.

"ఈ పూట తిన్నావంటే కొడతా," అని వార్నింగ్ ఇచ్చి పడుకుంది.

తల్లి పడుకుందని రూఢి అయినాక ఒకటొకటే తీసి మెల్లగా నోట్లో వేసికుని నమలటం మొదలుపెట్టాడు. నోరు తెరుచుకు చూస్తున్న చెల్లెలికి లంచం ఇచ్చి నోరు మూయించాడు.

ఇంత సేపు ఆ ఎదురుగా కూర్చున్న వ్యక్తి ఒదిగి కూర్చున్నాడు. బటానీలవాడు వెళ్ళాక సరిగా కూర్చుని "ఏ వెధవనీ ఛమ్మేందుకు వీల్లేదు," అనుకున్నాడు మొలలో దోపుకున్న సంచిని గట్టిగా పట్టుకుంటూ. దానిలో ఏముందో తెలియకపోలేదు.

మరోమూల వృద్ధుడు చుట్ట వెలిగించి చిన్మయానందం పొందుతున్నాడు. పైన బెర్తుమీద ఎవరో నిద్రపోతున్నారు.

అదృష్టవంతులు!

ఈ విచిత్ర వాతావరణం ఇంకా ఎంత సేపు కొనసాగుతుందో? శ్రావణ మాసపు అర్ధరాత్రివేళ సర్వప్రపంచమూ జలమయమైన సమయంలో రైలు సాగిపోతోంది. తప్పదు. అది దాని కర్తవ్యం.

రైలు వేగం హెచ్చింది. చెక్కిలికి చేయి చేర్చి మనసు దిటవుచేసికుని ఏ ఆలోచనలు లేకుండా కూర్చుందాం అని ప్రయత్నించాను. కాని భయం నా శరీరంలో విద్యుత్తులా ప్రవహిస్తోంది. ఈ భయం మృత్యువును ముందుగా చూపిస్తోంది. జీవితం, మరణం యొక్క కల అనిపించింది.

ఏది మిధ్య, ఏది సత్యం? తెలియటము లేదు. ఏదో అస్పష్టం, ప్రళయం వస్తున్న సూచన. వాయుకుమారులు అందమైన సృష్టిని ఛిన్నాభిన్నం చేయాలని చూస్తున్నారు. నా రక్తం వేడెక్కింది. ఈ చీకటి మా బ్రతుకుల్ని తనలోకి లాక్కోవాలని చూస్తున్నది. ఒక్కసారి ప్రపంచంతో నా సంబంధం తెగిపోయినట్లయింది.

ఇదంతా నాభయమేనేమో? రైళ్ళన్నీ

పడ్తున్నయ్యా ఎందరు ప్రయాణం? చేయటం లేదు? వారికి లేని భయం నాకా? ఇలా సంతృప్తి పడటం నాకు చేతకాదు. ఈ భయం నా జీవిత పునాదులనుండి నిర్మాణం అయింది. నాలో ఒక భాగమైంది. నా జీవితానికి నేనే ప్రేక్షకుడినైనాను ఇప్పుడు. సర్వనాశన మైన ఈ భయం ప్రపంచంలో ఎవరికైనా వుంటుందా? ఈభావసమాధి కంత మెప్పుడు? "మాస్టారు, టైమెంతైంది?"

నా చూపులు ప్రకృతినుండి విడివడి నయి. చూసి చెప్పాను.

అతని చర్య విచిత్రంగా వుంది.

ఇప్పటికి ఏ డజనుసార్లో సోపు తీసికుని ముఖం కడుక్కుని వచ్చాడు. ఓ పదిసార్లు క్రాపు దువ్వుకునివచ్చాడు.

ఏమిటి కథ అనుకున్నాను.

"ఎక్కడికి పోతున్నారు?"

నావంకచూసి మునిమునిగ నవ్వాడు.

"అలాపోతున్నాను."

చప్పగా వుంది జవాబు. అతనికి వుండవచ్చు. నామాట పూర్తి కాకుండానే ఎత్తుకున్నాడు.

"మా ఆవిడ దగ్గరికి. అయిదేళ్ళ అనంతరం పోతున్నాను. అబ్బ! వింటానికే భయంగాలేదూ ఐదేళ్ళంటే? ఏంచేస్తాం? చదువు - చదువు! పెళ్ళి చేస్తారు, వద్దన్నకొద్దీ. ఆవిడ్నక్కడా నన్నిక్కడా-"

"ఏవూరు?"

చెప్పాడు.

"ఫలాన జయరామారావు తెలుసా?" అన్నాడు, అతనేదో గొప్పవాడైనట్లు.

"తెలీదు."

"పోనీలేండి. అతను బావమరది."

తలూపి వూరుకున్నాను.

అతగాడు మొదలుపెట్టాడు.

తనపెళ్ళి ఎలాజరిగిందీ, పెళ్ళిలో ఎలాంటి వేషాలువేసిందీ - అన్నీను.

అతని వివాహంమీద నాకేమీ ఇంట్రస్టులేదు. కొంచెం విసుగుకూడ కల్గింది. వింటున్నట్లునటిస్తూకూర్చున్నా.

నిజానికి అతన్ని చూస్తే జాలివేస్తుంది. అతనేం చేశాడు?

జీవితాన్ని కళామయం చేసుకోవాలని చూస్తున్నాడు. కల్పనలోని అందాన్నీ ఆనందాన్నీ వాస్తవంలో చూడాలని ప్రయస్తున్నాడు. ఆమె సౌందర్యంలో పూర్తిగా లీనమై మత్తుగా మాట్లాడుతున్నాడు. ఉన్నట్లుండి నా మనస్సు అతని మనస్సునుంచి ఎగిరిపడింది. అతనెప్పుడు ఆపాడో కూడ నాకు తెలీదు.

ఇది నిద్రలేని రాత్రి. కసిగా నుసిగా నిశి రాలుతున్నది. ఈ జగదృశ్య సౌందర్యము ఎంతోగొప్పది. ఈ ఏకత్వంలో అన్నీ మరిచిపోయాను. నా నిరీక్షణ ఇంకా ఎంతసేపో నాకు తెలీదు. జీవిత స్మృతులలోని ఆనందపు పరిమళాన్ని గాని, విషాదస్వరాన్నిగాని తడమటానికి ఈ క్షణమే మిగిలింది.

ఈ చెట్లసందునుండి, ఈ కొండల మాటునుండి మాతోపాటు సమానంగా మృత్యువు పొంచిపొంచి నడుస్తున్నది. ఏ మలుపు తిరగ్గానేనో అందర్నీ చంపే స్తుంది. కాని ఒకటే తృప్తి. ఈ మర ణము నాకు అపజయంకాదు.

నా హృదయంలో సర్వవినాశకర మైన జ్వాల రగులుతున్నది. వేదనతో నా కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. ఆర్తుడనై ఒక్కసారిగా "రైలాపండి! పడిపోతున్నది!" అని అరవాలనిపిం చింది. కాని ఏదో మహాబలమైన శక్తి నా నోరు నొక్కేసింది. నా గొంతు మూగబోయింది. నా అహం ఈ భయం చుట్టూ పరిభ్రమించి దానిలో ఐక్యం అయింది. ఈ భయానికి ప్రేరణ ఏమిటి? ఈ విప్లవాత్మకమైన భారం నాగుండెల్లో ఎలా ప్రవేశించింది. ఎలా దీని నుండి విముక్తి? భ్రమ మిధ్యే కావచ్చు. ఐనా ఈభయం నా హృదయాన్ని కోత కోస్తున్నది. నా నరాలు వణుకుతున్నాయి! నాకు మతి స్తిమితం తప్పిపోతున్నది.

రైలు వేగం తగ్గింది.

రాత్రి శలవ తీసికుంటున్నది.

ప్రకృతి మేలిముసుగు సవరించు కుంటున్నది.

దూరంగా ఆత్మల్లా దీపాలు మినుకు మినుకు మంటున్నాయి.

అబ్బ ఎంతబాధ పడ్డాను! నా భయం కాలచక్రాన్నికూడ వేగంగాత్రిప్పిందేమో?

ఎందుకో రైలాగిపోతున్నది. ఆత్మలు దగ్గరకు వచ్చినయి. రైలాగిపోయింది.

ఎందుకు? ఎందుకు?

ఏదైనా ప్రమాదం జరిగిందా! బయట గోల. కిటికీలోంచిచూశాను. ఏదోస్టేషను.

అమ్మయ్య; కాసేపు ఆలోచనలకు- విశ్రాంతి. తల బ్రద్దలయిపోతున్నది. కళ్లు నిదురలేక మండుతున్నాయి. కాస్త టీ త్రాగివస్తేనైనా బాగుండును.

బాగ్ తీసికుని క్రిందికి దిగాను.

"ఏం స్టేష నిది?"

పోర్టరు చెప్పాడు.

"రైలెంత సేపాగుతుంది?"

"క్రాసింగుంది బాబయ్యా! అరగంట ఉంటుంది."

"టీ దొరుకుతుందా ఇక్కడ?"

"ఆఁ! అప్లాట్‌ఫారమ్మీద వుంది. వెళ్ళరండి." నేను వెళ్ళేసరికి టీ రెడిగా వుంది. ముఖం కడుక్కుని టీ త్రాగి వచ్చాను. బయట ప్రకృతి కళ్లు తెరి చింది ప్రసన్నంగా. తూర్పుదిక్కు పావు రాల కూతలతో ప్రసవవేదన పడుతోంది.

మనసు కాస్తతేలిక పడింది.

తిరావచ్చిచూస్తే రైలులేదు.


"రైలు వెళ్ళిపోయిందా?"

"అవును, చాలసేపయింది."

స్టేషనుమాస్టరు చెప్పాడు.

"అదేమిటి? అప్పుడే-"

"అవును, ఇక్కడ అయిదునిమి షాలే వుండేది."



"ఇందాక పోర్టరు అరగంట వుంటుం దని చెప్పాడే."

"వాడిమొహం! వాడి కేం తెలుసు? ఏవూరు పోవాలి?"

చెప్పాను.

"దాని కేం ఫరవాలేదు. పదిగంటలకి బస్సువస్తుంది ఇక్కడికి. దానిలో వెళితే సాయంకాలం చేరుతారు. ఆ వెయిటింగ్ రూమ్‌లో కూర్చోండి."

ఇంక చేసేదేంలేదు. పదింటిదాకా కూర్చోవాలి. ఈ నిరీక్షణ తప్పదు. వెయిటింగ్ రూంలోకి పోయి పడుకున్నాను. వేదనకి స్వస్తి. అలసిన మనసుకు విశ్రాంతి!

రెండు నిమిషాలుకూడ కాలేదు.

ఒకటేగోలా. కేకలు.

"యాక్సిడెంట్! ట్రైన్ యాక్సిడెంట్..."

స్టేషన్ మాస్టరు హడావుడిగా పరుగెడుతున్నాడు.

నా గుండె స్పందించటం ఒక్కసారి ఆగిపోయింది.

"యాక్సిడెంటా?"

"అవునుబాబు, ఇక్కడే, మూడు మైళ్ళ దూరంలో పడిపోయింది."

నేను ఆ చోటుకు పరిగెత్తాను.

భీభత్సంగా ఉంది ఆ ప్రదేశం!

అగ్ని కణాల్లాంటి పెదవులతో ఒక్కసారి స్పృశించింది ఈ సంఘటన నా మనసుని. నారక్తం వేడెక్కింది!

ఒకసారి కళ్లు బైర్లు క్రమ్మాయి. నాకళ్ళముందు ఇక్కడే మానవులు చనిపోతున్నారు. ఒక్కరూ ఇద్దరూ కాదు. వందల్లో! ఘోరంగా. భయంగా. బాధగా.

రక్తం ఏరులై ప్రవహిస్తోంది!

అకాశం, చూడలేక మబ్బులచేతుల్తో ముఖం దాచుకుంది.

కాలం హోరున ఏడుస్తోంది!

చూడలేక పోతున్నాను. ఏవో భావాలు మనస్సును కోస్తున్నయి. నా మనస్సు శకలాలయి పోతున్నది వాళ్ళందరి మధ్యకూ వెళ్ళి నిల్చున్నాను. మృత్యువు శ్వాసలు నాకు తగులుతున్నాయి.

కొందరికాళ్లు, కొందరిచేతులు, కొందరి తలలు, పోయినయి. హాహాకారాలు, ఏడుపులతో నిండిపోతోంది. హృదయం చిట్లి రక్తం కారుతున్నది.

నా చూపులు అందరిమీదా ప్రసరించినయి. దూరంగా – అతనే ఆ పసివాడు – తల్లితో పోట్లాడి బటానీలు కొనిపించినవాడు, ఆ శిశుస్వప్నంలో బహుశ ఒక సారి 'రేపు లేదు' అని అనిపించి వుంటుంది. కాని మాయ అతన్ని కప్పేసింది. అది భాష కందని మానసిక పరిణామం. నన్ను రాచుకుంటూ పోయి మృత్యువు ఆ పసివాడి జీవితపు తాళాన్ని తీస్తుందని ఎవరికి తెలుసు? అశలలో ఆనందం వుండవచ్చు. కాని ఈ ఆశ భస్మరాసేనన్న సంగతి వాడి లేతహృదయానికి తట్టి ఉండచ్చు. అందుకే అల్పమైన అనందాన్ని క్షణకాలం అనుభవించి ధీమాగా మృత్యువు చేయి పట్టుకున్నాడు. అది అమాయకత్వంవలనకూడా కావచ్చు కాని అతని ఉనికిని స్థిరపరచుకున్నమాట నిజం. వణుకుతున్న చేతులతో వాడి జేబు వెదికాను.

ఒక్కసారిగా బిలబిలమంటూ బటానీలు క్రిందకు దొర్లి పక్కన నవ్వినై.

అన్నదగ్గర పోట్లాడి లంచం పుచ్చుకొన్న చెల్లెలు యింకా అన్నని విడిచి పెట్టలేదు. తెల్లవారితే ఆయన వస్తారు సగంభారం వహిస్తారు అనుకున్న ఆ ఇల్లాలు తానే సగంభారం తగ్గించివేసింది.

ఎందుకో?

ఆ ఎనిమిది నెలల పసివాడు నిర్జీవమైన పెదవులతో తల్లిరొమ్ముతో రహస్యాలు చెబుతున్నాడు. నిర్జీవమైన ఆమెలోని సజీవ మాతృత్వం అ పసివాడ్ని పొదివి పట్టుకుంది.

కళ్ళు తిరిగినయి!

ఎటుతిరిగినా ఒకేదృశ్యం.

ఆ యువరసికుడు ఏ దేవకన్యదగ్గర తన రసికత్వాన్ని ఒలకబోస్తాడోగాని వెళ్ళిపోయాడు. పాపం అయిదేళ్ళ తరువాత భార్యను చూస్తాననుకున్నవాడు శాశ్వితంగా ఆమెకు దూరమైనాడు. పాపం అతనిభార్య తీయని కలలతో అతనికోసరం ఎదురుచూస్తూ వుంటుంది. ఇంకేముంది? జీవితమంతా మిగిలిన ఈ ఒకపీడకలతో మెలుకువతోకూ రోచ్చేవాలి. తిరిగిరాని అతనికోసం ఆమె అన్వేషణ.

ఈ నిండుచీకట్లో మిణుగురు పురుగును పట్టుకుని దారి చూసుకోవలసిన దుర్గతిపట్టింది. మెలుకువరాని పీడకల ఆమె జీవితం. ఈ ఖాళీని ఎవరూ పూడ్చలేరు. ఆమెప్రేమ వేదనామయమై,



యువ

ఆమె రక్తంలో కలిసి అంతర్వాహిని అవుతుంది. ఇంతకన్నా దారుణ శిక్ష మరేముంటుంది! విధి నాట్యం చేయటానికి ఆమెజీవితం చక్కని వేదిక అయింది. అతని ప్రేమ ఆమె కందదు.

చుట్టలో చిన్మయానందం అనుభవించిన వ్యక్తి, డబ్బుకీ ప్రాణానికీ లంకెపెట్టుకున్న వ్యక్తీ అంతిమయాత్ర కలిసే చేశారు. కాని దురదృష్టం ఏమిటంటే ఆ ధనం అత న్ననుసరించి వెళ్ళలేదు!

అక్కడుండలేక వచ్చేశాను!

వైద్య సహాయం జరుగుతోంది. నలుగురైదుగురు విలేఖరులు ఈ విషాద దృశ్యాన్ని ఫొటోతీయటంలో మునిగారు.

"ఉండండి, ఇప్పుడే ఈ వార్త పంపకండి. వాళ్ళవాళ్ళు దీన్ని భరించలేరు. కొన్ని వందల గృహాలలో దీపాలారిపోతాయి. వారికి లోకమంతా చీకటిగానే కనిపిస్తుంది. ఈ కాస్తసేపే ఆనందం, తమవాళ్ళు వస్తారని ఆశా, ఆ ఆశలో ఆనందం-తృప్తీ.

రేపే వార్త పేపర్లలో వచ్చేస్తుంది. రాక తప్పదు. వాళ్ళకు తెలియక తప్పదు. ఎండమావులలో ఏమీ లేదని తెలుసుకోక తప్పదు వాళ్ళకి. ఆరిపోయిన దీపం లాంటి జీవితంతో చివరివరకు బాధపడక తప్పదు.

ఈ అనుభవం నా జీవితపు ఎడారిలో మంచుబిందువై ఓ నిముషం నవ్వి ఆరిపోదు. నా ఆత్మలో, నా హృదయంలో గాఢంగా చెరగని ముద్ర వేసికుంది ఈ సంఘటన. దీని ప్రకంపన తీవ్రమైనది.

భగవాన్! ఏమిటి నీ ఆట. నీ చదరంగం బల్లమీదికి వీళ్ళని విసిరి ఎలా మారుస్తావు? నీకళామయ చిత్రంలో ఇది ఓ అర్థంలేని రంగు అనుకోమంటావా? ఎంత కఠినం నువ్వు? చావు - బ్రతుకు కాలానికి రెండువైపులు! నా కళ్ళల్లోంచి ఆఖరి కన్నీటిబొట్లు రాలాయి. తల వంచుకుని బయలుదేరాను. దేవుని మిధ్యావ్యక్తిత్వం బయటపడింది ఈ సంఘటనతో. నా గుండెబరువు ఇంకా తగ్గలేదు. నా చుట్టు సాలెగూడు కట్టుకున్న చరిత్ర నన్ను పరిహసించింది.

ఏమైంది?

నేను తప్ప అందరూ మరణించారు. నాతో ఇంత క్రితం దాకా చీకూచింతా లేకుండా ప్రయాణం చేసినవాళ్ళు. వడ్డించిన విస్తరిని జీవితం చేసుకున్న వాళ్ళు, మరణాన్నినిర్లక్ష్యం చేసినవాళ్ళు.

ఈ క్షుద్ర జాగృతికి అంతమెక్కడ? లేదు. ఎప్పుడు లేనేలేదు. నా ఆత్మలో ఈ రకం విషాదంగా విన్పిస్తూనే వుంటుంది. ఎప్పుడైనా ఏకాకిగా ప్రకృతిలోకి వెళ్ళినప్పుడు ఆకాశంలోని నీలిమలోంచి సన్నని సన్నాయి స్వరం మల్లే నా ఆత్మని స్పృశించి మళ్ళీ ఆ నీలిమలో లీనమైపోతూ వుంటుంది.

దూరంగా పోతున్న కొద్దీ ఆ శోకం క్రమక్రమంగా తగ్గి, పుట్టినమానవుడు పెద్దవాడై వృద్ధుడై తుదకు మరణించి నట్లు, ఉచ్ఛస్వరంలో వినిపించి క్రమంగా హీనమై తుదకు నిశ్శబ్దంలో అంతరించి పోయింది. నా మనస్సు ఆవేశ తరంగాల మీద నృత్యం చేస్తున్నది.

స్టేషన్ చేరుకున్నాను. ప్రక్క పోస్టాఫీసు తప్ప అంతా శూన్యంగా వుంది. ఈ పోస్టాఫీసునుంచే దేవునిపిలుపులు వెళ్ళివుంటాయి వాళ్ళకి. అందుకే హఠాత్తుగా జీవితంలో ఉత్తమమైన బహుమతిని అందుకున్నారు. చప్పున మా తాతగారనే మాట గుర్తువచ్చింది.

'జన్మంతా ఒక పవిత్రయజ్ఞం.
చావందులో పూర్ణాహుతి.
జన్మకు సత్యం చావొక్కటే_'

పోస్టాఫీసు చూసేసరికి ఇల్లు గుర్తు వచ్చింది. ఈవార్త వసంత చూస్తుంది - చూసి - శూన్యగృహంలాంటి తన జీవితంలో, దీపం వెలిగించుకోలేని స్థితిలో తన ఆత్మకందని పిలుపుకోసరం - విలపిస్తూ వుంటుంది.

దీపం వెలిగించాలి; తప్పదు. మళ్ళీ మృత్యువు తలుపు తట్టేంతవరకు ఈ ఇంట్లో వుండాలి.

"నేను బ్రతికేవున్నాను వసూ, నీ కోసరం, పాపకోసరం_" అని ఉత్తరం వ్రాయాలి.

కార్డు కొన్నాను. పక్కన బెంచీమీద కూర్చునివ్రాయబోతుంటే ఒక్కసారి ఆ సంఘటన కళ్ళల్లో మెదిలింది.

"వణుకుతున్న చేతులతో వ్రాసి పోస్టు చేశాను.

"నీవు క్షమించరాని మహాపరాధం చేశావు." కాని అడ్రసు వ్రాయలేదు. వ్రాసినా అది పోదు.

శూన్యమైన ప్లాట్‌ఫారంమీద ఒంటరిగా నిలబడ్డాను. ఆకాశంలో ఎర్రని మంటలు లేచాయి. ఆ మంటలకు మధ్యగా మృత్యువు వెళ్ళిపోతున్నది. ఒక్కసారిగా మృత్యుదేవత తన బొడ్లోంచి తాళపుచెవులగుత్తి తీసి ఇందరి జీవితపు తాళాలు తీస్తుందని ఎవరికైనా తెలుసా? మృత్యువుది ఇంత మృతసంస్కృతి అని ఎప్పుడైనా ఊహించావా?

(అంకితం: పసివాని ఆత్మశాంతికి)

———